క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న నర్సింహ

కడ్తాల్: మండల కేంద్రంలో అపర్ణ పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ రూ.75వేల విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేశారు. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో భక్తిభావం పెంపొందుతుందని అన్నారు. ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ విరాళాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బాలయ్య, సత్యనారాయణ, బుచ్చయ్య, కృష్ణయ్య, రామకృష్ణ, బాల్‌రాజ్, యాదగిరి ముదిరాజ్ సంఘం నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి మెటీరియల్ అందజేత



మెటీరియల్‌ను అందజేస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి

తలకొండపల్లి: శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధికి కృషిచేస్తానని స్థానిక నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూలపల్లిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం ఇసుక, సిమెంట్, స్టీల్, కాంక్రీట్ తదితర మెటీరియల్‌ను విజయ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఆలయంలో పెండింగ్ పనులు పూర్తిచేసి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కల్వకోలు శ్రీనివాసులు, వైస్ చైర్మన్ యాదమ్మ, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు అశోక్, వార్డుసభ్యులు పాండు, అంజయ్య, వేణు, యాదయ్య, శివ, మణికంఠ, కృష్ణ, సంజీవ, శేఖర్ పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా నిరాహార దీక్ష: జెడ్పీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

ఆమనగల్లు: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని కొన్నిరోజులుగా ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఆమనగల్లు పట్టణంలో మంగళవారం టీఆర్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం అనురాధ మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోకుండా ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లపై పోలీసులు దాడి చేయడం సిగ్గుచేటని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కపెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరాహార దీక్షలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాధమ్మ, కోనాపూర్ ఎంపీటీసీ సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీరుస్తాం



బోర్ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సంగీత

తలకొండపల్లి: పైపులైన్ల లీకేజీలను అరికట్టడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో బోర్ డ్రిల్లింగ్ పనులు చేపడతామని సర్పంచ్ సంగీత అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్ రచ్చకట్ట వద్ద మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి బోర్ డ్రిల్లింగ్ పనులను సర్పంచ్ ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో గ్రామంలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధిలో మినీ వాటర్‌ట్యాంక్‌లను నిర్మించి తాగునీటి ఎద్దడిని తీరుస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహ్మాన్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచ్ అజీజ్, మహేష్‌నేత, ఎంపీటీసీ అంబాజీ, శ్రీను, శేఖర్, శ్రీకాంత్, అంజిరెడ్డి, బాలకుమార్‌గౌడ్, రవి, సుల్తాన్, శ్రీరామ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేదలకు అండగా ఉంటానని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన బండ ఐలేశ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ పల్లె రేణుక సదానందంగౌడ్ తల్లి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



కడ్తాల్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



తలకొండపల్లిలో పోలీసుల బైక్ ర్యాలీ

శాంతిభద్రతలకు ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ఘనంగా పోలీసు సురక్ష దినోత్సవం

కడ్తాల్: రాష్ట్రంలో శాంతి భద్రతలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో పోలీసు సురక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రంలో పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎంబీఏ గార్డెన్‌లో సురక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ ఉపేందర్, ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి, పోలీసు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించి, సాంకేతికంగా ఎంతో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని గుర్తుచేశారు. రూ. 5వేల కోట్లతో నిఘా వ్యవస్థను పటిష్టం చేశారని, ఇటీవల రూ.500 కోట్లతో కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు ఎంతో దగ్గరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, ఉపసర్పంచ్‌లు రామకృష్ణ, వినోద్, నాయకులు ఉన్నారు.

తలకొండపల్లిలో బైక్ ర్యాలీ..

తలకొండపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో ఎస్‌ఐ వెంకటేశు యాదవ్ ఆధ్వర్యంలో పోలీస్ సురక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో మంచి గుర్తింపు..

ఆమనగల్లు: శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం ముందువరుసలో నిలిచిందని ఆమనగల్లు సీఐ ఉపేందర్ అన్నారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సురక్ష దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుశాఖ గురించి, అత్యవసర సమయంలో పోలీసు శాఖను ఏ విధంగా ఉపయోగించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల రక్షణకు తెలంగాణ రాష్ట్రం చిరునామాగా మారిందని అన్నారు. రాష్ట్రంలో 60 శాతం ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయని ఆయన వివరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా పోలీసులు ప్రజలకు దగ్గరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ అనిత, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, ఎస్‌ఐ సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



ఆమనగల్లు: మాట్లాడుతున్న సీఐ ఉపేందర్

గిరిజన బంధును అమలు చేయాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్

తుర్కయంజాల్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన బంధును వెంటనే అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినప్పటికీ నేటికీ నెరవేరలేదని.. నిధుల లేమితో గిరిజన సంక్షేమ శాఖ వెలవెలబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజన యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న గిరిజన వారోత్సవాల్లో గిరిజన బంధుకు సంబంధించిన జీఓను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాండునాయక్, ఉపాధ్యక్షుడు గోపీనాయక్, జిల్లా సహాయ కార్యదర్శి నేనావత్ పార్వతి, వెంకటేశ్, లక్ష్మణ్, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.



రాగన్నగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన నాయకులు

గోవిందాయిపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న తండావాసులు

కడ్తాల్: నిరుపేదలకు సేవలందించడమే ఐక్యతా ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండా గ్రామ పంచాయతీలో ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. తండాల్లో శుద్ధమైన తాగునీటిని అందించడం కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా తండాలోని హనుమాన్ ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తండావాసులు రాఘవేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు భాస్కర్, సేవ్యా, మోహన్, నాయకులు శత్రునాయక్, నిరంజన్, రూప్‌సింగ్, బాల్యాబావోజీ, మాజీ సర్పంచ్ శ్రీరాములు, యువకులు మల్లేశ్, శివ, దేవా, ఫౌండేషన్ సభ్యులు, మహిళలు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగిఉండాలి

- జెడ్పీటీసీ మర్రి నిత్యారెడ్డి

మంచాల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగిఉండాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రినిత్య నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండలంలోని సత్యంతండాలో నిర్వహించిన బొడ్రాయి ఉత్సవాల్లో మర్రినిత్యనిరంజన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలంతా ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. సుఖసంతోషాలతో పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన కోసం రూ.30 వేలు ఆర్థికసహాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు కమలాకర్‌రెడ్డి, సత్యంతండా సర్పంచ్ పెంట్యానాయక్, ఎంపీటీసీ రాందాస్‌నాయక్, ఉప సర్పంచ్ జ్యోతి, నిర్వాహణ కమిటీ సభ్యులు బాలునాయక్, సాగర్, శ్రీకాంత్, కిషన్‌నాయక్, పంత్యానాయక్, సుమన్, రమేష్ పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి దంపతులు

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టండి

మంత్రి తలసానిని కలిసిన శేరిగూడ గొర్రెల కాపర్లు



మంత్రి తలసానికి వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్‌ఆర్‌డీపీ స్కీం ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శేరిగూడ గొర్రెల కాపర్లు కోరారు. ఆదివారం నగరంలోని మంత్రి నివాసానికి వెళ్లిన బీరప్ప స్వామి ప్రైమరీషిప్ బ్రీడర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ శేరిగూడ సంఘం సభ్యులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. గొర్రెల కాపర్లకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తోందని అన్నారు. వారి ఆర్థికాభివృద్ధి తోడ్పాటునందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాము యాదవ్, శేరిగూడ బీరప్పస్వామి ప్రైమరీషిప్ బ్రీడర్స్ కోఆపరేటివ్ లిమిటెడ్ అధ్యక్షుడు క్యామ శ్రీకాంత్, కృష్ణ,శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు .

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

హస్తినాపురం: వ్యాయామాలు, ఆసనాలు ప్రాణాయామాలు ప్రతినిత్యం సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని శ్రీ సిద్ధిరాజ్ తపోద నగిరి స్వామీజీ అన్నారు. మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీహాల్‌లో షిరిడీసాయి అష్టాంగ యోగా సాధన ఫౌండర్ ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణా తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధిరాజ్ గురూజీ మాట్లాడుతూ.. యోగా సాధన నేర్చుకోవడానికి వయసుతో ప్రమేయం లేదని ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగసాదన ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. యోగా శిక్షణకులు ఇస్మాయిల్ మాట్లాడుతూ.. 15 రోజుల పాటు సాగే యోగా శిక్షణ తరగుతుల్లో వివిధ ఆసనాలు నేర్పిస్తామని అన్నారు.

కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- వంశీచంద్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో నాయకులు

తలకొండపల్లి: కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. వృద్ధులు, చిన్నారులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ అజీం,జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి,డీసీసీ ప్రధాన కార్యదర్శులు అంజయ్యగుప్తా,రవీందర్‌యాదవ్, మహేష్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, యూత్‌కాంగ్రెస్‌అధ్యక్షుడుజనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు: మండలంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ కేక్ కట్ చేశారు. స్థానిక ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు నారయ్య, కాంగ్రెస్ నాయకులు కృష్ణనాయక్, శ్రీశైలం, జహంగీర్, బాబా, రాఘవేందర్, సురేశ్‌నాయక్, రాజు, శ్రీకాంత్, ఫరీద్, వాటర్‌బాబా పాల్గొన్నారు.



ఆమనగల్లు: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రీడల్లో గెలుపోటములు సహజం

- బీఆర్‌ఎస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి

మహేశ్వరం: క్రీడలు శారీరక దారుఢ్యాన్ని, మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మన్సాన్‌పల్లిలో మన్సాన్‌పల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ (ఎంపీఎల్-6) పోటీలు ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతి రోజు క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఓడిపోయిన వారు గెలుపు కోసం పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారి ప్రోత్సాహానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎంఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రికెట్ పోటీల్లో ఎంఆర్‌ఆర్(మర్యాద రాఘవేందర్‌రెడ్డి) జట్టు విన్నర్, మణికంఠ దాక్యుమెంటేషన్ జట్టు రన్నర్‌గా నిలిచారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రమేశ్, ఉప సర్పంచ్ నర్సింహయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పబ్బ అంజనేయులు గౌడ్, మహేష్ పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

- జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగినేని కృష్ణవేణి

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగినేని కృష్ణవేణి ధ్వజమెత్తారు. ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలోని జిల్లా కార్యాలయంలోఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఆగడాలు భరించలేక తెలంగాణ భవన్‌లో మహిళ ఆత్మహత్య చేసుకుందని,దీనికేనా బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటుందని ప్రశ్నించారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడుల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని ఎద్దేవచేశారు. గ్రూప్-1 పేపర్ లీకేజీ ఘనటపై న్యాయ విచారణకు భయపడి కేవలం సిట్ విచారణతో సరిపెట్టడం ప్రభుత్వ డొల్లతనానిని నిదర్శనమన్నారు. నాయకురాళ్లు నందికొండ గీతారెడ్డి, పోరెడ్డి కవితారెడ్డి, విజయ, వర్కాల వీణ, గీతారెడ్డి, లక్ష్మి, కర్నాటి మాధవి, ప్రశాంతి పాల్గొన్నారు.

నిరుపయోగంగా జెడ్పీ అతిథి గృహం

- ఐదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు

యాచారం: మండల కేంద్రంలో నిర్మించిన జెడ్పీ అతిథిగృహం ప్రారంభానికి నోచుకోకముందే శిథిలావస్థకు చేరుకుంటోంది. ఐదేళ్ల కిందటే నిర్మాణ పనులు పూర్తియినప్పటికీ ప్రారంభించకపోడంతో ప్రస్తుతం కిటికీలు, తలుపులు పాడైపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎనిమిదేళ్ల కిందట అప్పటి జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి యాచారం మండల కేంద్రంలో రూ.25 లక్షల నిధులతో జెడ్పీ అతిథి గృహం నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశారు. అదే ఏడాది అతిథి గృహం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మూడేళ్ల అనంతరం నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నాసిరకమైన పనులు చేపట్టినట్లు విమర్శలున్నాయి. దీంతో ఫర్నీచర్, కిటికీలు ఉపయోగంలోకి రాకముందే తుప్పుపట్టిపోతున్నాయి. దీంతో పక్షులు, విషసర్పాలు లోపలికి వస్తున్నాయి. భవనం లోపల పూర్తిగా చెదలు పట్టి శిథిలావస్థకు చేరుకుంది.

గత ఎన్నికల్లో ప్రారంభించాల్సి ఉన్నా..

గత అసెంబ్లీ ఎన్నికలకంటే ముందే ఈ భవనాన్ని ప్రారంభించాల్సి ఉన్నా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ కార్యక్రమం వాయిదాపడింది. అప్పటి నుంచి ఈ భవన ప్రారంభోత్సవాన్ని ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఆలోపైన జెడ్పీ అతిథి గృహాన్ని ప్రారంభిస్తారా.. లేదా అని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై ఉన్న ఈ అతిథిగృహాన్ని వాడుకలోకి తెస్తే తరుచూ మండల పర్యటనకు వచ్చే వీఐపీలకు ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక నేతలు తెలుపుతున్నారు. మరమ్మతులు చేపించాలని కోరుతున్నారు. మళ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ప్రారంభానికి మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉంటుందని త్వరగా చిన్నచిన్న మరమ్మతులు చేయించి జెడ్పీ అతిథి గృహాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



యాచారంలోని జెడ్పీ అతిథి గృహం

త్వరలో ప్రారంభిస్తాం



నిర్మాణ పనులు పూర్తిచేసుకున్న జెడ్పీ అతిథి గృహాన్ని త్వరలో పరిశీలిస్తా. భవనంలో ప్రస్తుతం ఏఏ పనులు అవసరం ఉన్నాయో ఎంతమేర నిధులు అవసరముతాయో నివేదిక రూపొందించి.. జెడ్పీటీసీ, ఎంపీడీఓతో కలిసి చర్చిస్తా. నిధుల మంజూరుకు జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా. వీలైనంత త్వరగా నిధులు మంజూరుచేయించి ఆయా మరమ్మతు పనులను పూర్తిచేసి జెడ్పీ అతిథి గృహాన్ని ప్రారంభించేందుకు కృషి చేస్తా.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం